క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రఘునాథపాలెం: ఖమ్మం అర్బన్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని రఘునాథపాలెం మండలం వీవీపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ ఏఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

డిసెంబర్ 1న 'భలే మంచి రోజు'

ఖమ్మంగాంధీచౌక్: అమర గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా డిసెంబర్ 1 ఆదివారం సాయంత్రం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో 'భలే మంచిరోజు'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వహణ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టి.వాసుదేవ్, శఠగోపం సుదర్శన్‌లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాకారులు, కళాభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయవంతం చేయాలని కోరారు.

సర్వే వివరాల ఆన్‌లైన్ ప్రారంభం

ఖమ్మంమయూరిసెంటర్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సేకరించిన వివరాలను కేఎంసీ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను కేఎంసీ అధికారులు శనివారం ప్రారంభించారు. కొన్ని ఎన్యుమరేటర్ల బ్లాక్‌లలో సర్వే పూర్తి కావడంతో.. ఆన్‌లైన్‌లో సమాచార నమోదును చేపట్టారు. ఇందుకు గాను ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొంచి, ఆపరేటర్లకు లాగిన్ ఐడీలను అందేసింది.

కవితా సంకలనం ఆవిష్కరణ


విద్యార్థినులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటరమణ

ఖమ్మంరూరల్: ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల అకడమిక్ డైరెక్టర్, కవి, రచయిత అట్లూరి వెంకటరమణ రచించిన 'మహార్ణవ ఘోష' కవితా సంకలనాన్ని మండలంలోని పెదతండాలో విద్యార్థినులతో శనివారం ఆవిష్కరణ చేయించారు. ఈసందర్భంగా అట్లూరి మాట్లాడుతూ కవితలు భవిష్యత్ లక్ష్యాలపై యువతకు దిక్సూచిలా నిలుస్తాయని తెలిపారు. కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు మాట్లాడగా ప్రిన్సిపాల్ బి.గోపాల్, వివిధ శాఖాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాదాద్రిలో చిన్నారుల భరతనాట్యం

ఖమ్మంగాంధీచౌక్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన ధార్మిక సాహిత్య సంగీత ఉత్సవాల్లో ఖమ్మం నగరానికి చెందిన చిన్నారులు భరత నాట్య ప్రదర్శన చేశారు. నిర్వాహకులు చిన్నారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాట్య గురువు ఫణి తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

తిరుమలాయపాలెం: అకాల వర్షాలు, వరదలతో సర్వం కోల్పోయిన రాకాసితండా ప్రజలను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బీఆర్‌ఎస్ మండల కమిటీ ఆధ్వర్యాన రాకాసి తండా గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. వరదలో నిత్యావసరాలతో పాటు భూములు సైతం కొట్టుకుపోయాయని ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు బానోత్ రవి, మాజీ సర్పంచ్ బోడ మంచానాయక్, నాయకులు మోహన్, రమేష్, సురేష్, సహదేవ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	44	బచ్చలికూర	3
వంకాయ	38		20
బెండకాయ	28	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	34	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	48	తోటకూర	3
దొండ	34		20
పొట్లకాయ	38	గోంగూర	4
చిక్కుడు	68		20
గోరుచిక్కుడు	34	మెంతికూర	2
క్యాబేజీ	34		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	34		40
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	64		25
క్యాప్సికం	54	-ఖమ్మం వ్యవసాయం	

భరించగలిగేలా..!


వైరారోడ్‌లో ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల స్టాళ్లు

సండే స్పెషల్

వణికించే చలిలో స్వెటర్ ఎంతో బెటర్

- పెరిగిన ఉన్ని దుస్తుల కొనుగోళ్లు
- రహదారుల వెంట విక్రయాలు
- ఖమ్మంలో టిబెటిన్ల ప్రత్యేక స్టాళ్లు

ఖమ్మంగాంధీచౌక్: గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. దీంతో ఇంటి నుంచి బయటకు రావాలంటే చలి వణికిస్తుండడంతో స్వెటర్ ఎంతో బెటర్ అనకతప్పదు. పగలు ఎండ ఉన్నప్పటికీ చలి వాతావరణం మాత్రం ఉంటుంది. ఇక సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు కూడా తీవ్రత తగ్గడం లేదు. సాయంత్రం నుంచి రాత్రి తెల్లవారు జామున వరకు వివిధ రకాల పనులకు వెళ్లేవారు, ప్రయాణికులు తమ వెంట చలి దుస్తులు తప్పకుండా తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఈనేపథ్యాన నగరంలోని పలు ప్రాంతాలు, రహదారుల వెంట ఈశాన్య రాష్ట్రాలకు చెందిన విక్రయదారులు చలి దుస్తులు విక్రయిస్తున్నారు. ఇవి ముఖ్యంగా వరంగల్ క్రాస్‌రోడ్ వైపు, బైపాస్ రోడ్, కరుణగిరి, రాపర్తినగర్, ఇల్లెందు రోడ్ శ్రీశ్రీ సర్కిల్ నుంచి వైరా రోడ్‌లో నవంబర్ ఆరంభం నుంచి చిన్నచిన్న స్టాళ్లు ఏర్పాటు చేసుకుని విక్రయిస్తున్నారు.

టిబెటిన్ల దుస్తులు ప్రత్యేకం..

పెరిగిన చలితో చలి దుస్తులకు డిమాండ్ బాగా పెరిగింది. ఢిల్లీ, కశ్మీర్ రగ్గులు, స్వెటర్లు, మఫ్లర్లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజుల పేరిట వ్యాపారులు విక్రయాలు చేపడుతుండగా.. సాయంత్రం వేళల్లో విక్రయాలు అధికంగా ఉంటున్నాయి. ఉన్నితో తయారు చేసిన నాణ్యమైన దుస్తులను కొనుగోలు చేస్తున్నారు. చలి దుస్తులకు టిబెటిన్లు ప్రత్యేకం కావడంతో శీతాకాలం వచ్చిందంటే నాలుగు నెలలు ఆ కుటుంబాలు ఖమ్మాన్ని తమ సొంత గడ్డగా భావించి విక్రయాలు చేపడతారు. ఢిల్లీ, కశ్మీర్ వంటి ప్రాంతాల్లో ప్రత్యేకంగా చలి దుస్తులు తయారు చేయించి ప్రతి ఏటా 10 టిబెట్ కుటుంబాలు వలస వచ్చి ఇక్కడ జీవనోపాధి పొందుతున్నారు.

నాణ్యత ఆధారంగా..

చలి దుస్తుల రకాలు, నాణ్యతలను బట్టి ధరలు నిర్ణయించి విక్రయిస్తున్నారు. రగ్గులు రూ. 900 నుంచి రూ. 2 వేలు ఆ పైన ధరలు ఉండగా.. పెద్దవారికి స్వెటర్లు రూ.450 నుంచి రూ. 1000ల వరకు, మంకీ క్యాప్‌లు రూ.10 ఆపైన, గ్లౌజులు రూ.70 నుంచి రూ.120ల వరకు విక్రయిస్తున్నారు. ఇక పిల్లలకైతే రూ. 400ల నుంచి రూ. 600ల వరకు, మహిళల స్వెటర్లు రూ. 500ల నుంచి రూ. 1,200ల వరకు విక్రయిస్తున్నారు.


స్వెటర్లు కొంటున్న వినియోగదారులు

ప్రయాణం ఇబ్బందిగా ఉందని..



పని నిమిత్తం ఉదయం ఇంటి నుంచి 7 గంటలకు బయలుదేరి సాయంత్రం 6 గంటల తరువాత ఖమ్మం నుంచి ఇంటికి వెళ్తా. ఈ సమయాన చలికి తట్టుకునేలా స్వెటర్, గ్లౌజులు మొత్తం రూ. 800లకు కొన్నా. ద్విచక్రవాహనంపై ప్రయాణం ఇబ్బందికరంగా ఉంది. – శంకర్, ఇస్లావత్ తండా, తిరుమలాయపాలెం మండలం

చలికి తట్టుకోలేక..



రాత్రి వేళలో చలి పీక్కు తింటుంది. అందుకే స్వెటర్ రూ. 550, రగ్గు రూ.1,200లకు కొన్నా. సాయంత్రం స్వెటర్ లేకుండా బయటకు వెళ్లడం ఇబ్బందిగా ఉంటుంది. ఉదయం లేచి పనిచేసుకోవాలన్నా, బయటకు వెళ్లాలన్నా నా వెంట స్వెటర్ ఉండాల్సిందే. – ఉపేందర్, ఖమ్మం

40 ఏళ్లుగా వస్తున్నాం..



40 ఏళ్లకు పైగా వారసత్వంగా ప్రతి సీజన్‌లో ఇక్కడ వ్యాపారం చేస్తున్నాం. ఖమ్మంలో చలి దుస్తుల విక్రయంతో ఉపాధి లభిస్తుంది. జనవరి వరకు గిరాకీ ఉండే అవకాశం ఉంది. ఇక్కడ ప్రభుత్వ అధికారులు సహకరిస్తున్నారు. కశ్మీర్, ఢిల్లీ ప్రాంతాల నుంచి చలి దుస్తులు తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. – టి.డొల్మ, నిర్వాహకురాలు, వైరారోడ్

విజయవంతం చేయండి

కలెక్టరేట్ ముట్టడిని..


ఖమ్మం మామిళ్లగూడెం: ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంమయూరిసెంటర్/తిరుమలాయపాలెం/ఖమ్మంమామిళ్లగూడెం: మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020 నవంబర్ 26న ప్రారంభమైన చారిత్రాత్మక రైతాంగ ఉద్యమం 4వ వార్షికోత్సవం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు (సీటీయూ) ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చాయి. ఎన్నికల ముందు మోదీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, కార్మికులకు పెంచిన పని గంటలు తగ్గించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ఉపాధి పనులను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యాన శనివారం ఖమ్మంలోని సంజీవరెడ్డి భవన్‌లో సంయుక్త ప్రశాంత్ మోర్చా, జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు పిలుపునివ్వగా.. కార్మిక సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, నాయకులు కొత్త సీతారాములు, లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, తుమ్మ విష్ణు, దొండపాటి రమేష్, కె.శ్రీనివాస్, తాటి వెంకటేశ్వరరావు, ఎర్ర శ్రీనివాసరావు , మెరుగు సత్యనారాయణ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అలాగే రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో టీయూసీ జిల్లా కార్యదర్శి జి.రామయ్య మాట్లాడగా.. సమావేశంలో నాయకులు కె.శ్రీనివాస్, బొమ్మకంటి రమేష్, పేరబోయిన వెంకన్న, జలగం రాంబాబు, జోగ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అంతేకాక తిరుమలాయపాలెంలోని గజ్జల వెంకటయ్య భవనంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల వెంకయ్య మాట్లాడగా.. నాయకులు తిమ్మిడి హనుమంతరావు, మట్టి దుర్గాప్రసాద్, మందడి ఇబ్రాయిల్, ఉన్నాం రాజశేఖర్, గొర్రెపాటి రమేష్, మారుతి మల్లయ్య, బానోతు శంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నుంచి మూడు బొమ్మల సెంటర్ వరకు సీపీఎం ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహించగా.. ఖమ్మం జిల్లా నాయకుడు ఎర్రా శ్రీనివాసరావు మాట్లాడారు. నాయకులు బండారు యాకయ్య, ఎల్లంపల్లి వెంకట్రావు, నాగసులోచన, షేక్ హిమాం, వీరబాబు, జార్జి, షేక్ మస్తాన్, అమీనాబీ, తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను..

ఖమ్మం మామిళ్లగూడెం: హైదరాబాద్‌లోని జింకాన గ్రౌండ్స్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర కో చైర్మన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ గోసోజు రమేష్, జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం చర్చి కాంపౌండ్ కమ్యూనిటీ హాల్‌లో సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించాక ఆయన మాట్లాడారు. నాయకులు లింగాల రవికుమార్, దామళ్ల సత్యనారాయణ, పల్లా రాజశేఖర్, నారుమళ్ల వెంకన్న, జాకబ్ ప్రతాప్, బాబురావు, సుధాకర్, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

వనసమారాధనను..

కామేపల్లి: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యాన ఆదివారం ఖమ్మంలో జరిగే వనసమారాధనకు యాదవ, కురమ కులస్తులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్ కోరారు. శనివారం పండితాపురం గ్రామంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మేకల మల్లికార్జున్‌యాదవ్, చింతల వెంకయ్య, అర్వ సత్యం, బాబు, గంగయ్య, లాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దళారుల దందాపై అధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..

నేలకొండపల్లి: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 'కొనుగోలు కేంద్రంలో దళారుల దందా'అనే శీర్షికన 'సాక్షి'లో శనివారం కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనికి స్పందించిన అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. వీరిలో డీసీఎంఎస్ మేనేజర్ సందీప్, సివిల్ సప్లయీస్ ఆర్‌ఐ నరేష్, ఎస్సై పి.సంతోష్, మార్కెట్ కమిటీ కార్యదర్శి నాగేశ్వరి, వ్యవసాయ విస్తీర్ణాధికారి అరవింద్, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రవి, పంచాయతీ అధికారులు పాల్గొని కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులకు పిలిపించి మాట్లాడారు. అంతేకాక పలు రికార్డులను పరిశీలించి సేకరించిన వివరాలను జిల్లా అధికారులకు అందించనున్నట్లు పేర్కొన్నారు.


విచారణ చేస్తున్న అధికారులు

కొర్రీలు లేకుండా ధాన్యం కొనాలి

కూసుమంచి: తేమ శాతంతో సంబంధం లేకుండా రైతులు తీసుకొచ్చిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ నాయక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. కూసుమంచిలోని కొనుగోలు కేంద్రాన్ని శనివారం పరిశీలించిన వారు రైతుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ త్వరలో తుపాన్ ప్రభావం ఉందనే సంకేతాలతో కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలన్నారు. నాయకులు తోటకూరి రాజశేఖర్, బిక్కసాని గంగాధర్, మల్లెల సన్మంత్ రావు, యడవెల్లి రమణారెడ్డి, చలపతిరావు, రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన


జుజుల్‌రావుపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ

కూసుమంచి: మండలంలోని జుజుల్‌రావుపేట, మల్లేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం కూసుమంచి ఏడీఏ సరిత పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి కొనుగోళ్ల రికార్డులను పరిశీలించారు. రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించి ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. అనంతరం జుజుల్‌రావుపేట గ్రామంలో వరికొయ్యలను తగులబెట్టడం వలన కలిగే అనర్థాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వాణి, ఏఈఓలు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈఓ తనిఖీ

ఖమ్మంఅర్బన్: మండలంలోని వేణుగోపాల్‌నగర్ పాఠశాలను శనివారం ఎంఈఓ కేవీ శైలజలక్ష్మి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్యాహ్న భోజనం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల ప్రగతిని పరిశీలించి విద్యార్థుల హాజరుశాతం తగ్గకుండా చూడాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుడిపూడి శ్రీనివాసరావు, కె.హైమావతి, సీఆర్‌పీలు డి.మానస, బాలకృష్ణ, మధ్యాహ్న భోజన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అన్నం' ఆధ్వర్యాన అంత్యక్రియలు

ఖమ్మంవైద్యవిభాగం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన అవివాహితుడు రామ్‌కుమార్ (38) ఇటీవల తీవ్ర అనారోగ్యంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. ఈక్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందగా.. మృతదేహాన్ని వైద్యశాల సిబ్బంది మార్చురీలో భద్రపరిచారు. మృతుడికి ఇల్లెందులో సొంతిల్లు లేకపోవడం, మృతదేహాన్ని ఇల్లెందు తరలించే ఆర్థిక స్తోమత లేకపోవటంతో కుటుంబ సభ్యులు అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని కుటుంబ సభ్యులు, వైద్యశాల సిబ్బంది సమక్షంలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని బల్లేపల్లిలోని వైకుంఠధామంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు పాటు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని అనంతనగర్ గ్రామానికి చెందిన నాగరాజు (22) అనే యువకుడు శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

సర్వేకు సహకరించాలి

ఖమ్మంఅర్బన్: కులగణన సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగరంలోని 8వ డివిజన్ వైఎస్‌ఆర్‌నగర్‌లో నివాసులకు కార్పొరేటర్ లకావత్ సైదులు అవగాహన కల్పించారు. తప్పుడు ప్రచారాలను నమ్మకుండా ఎన్యూమరేటర్లకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్, ఎన్యూమరేటర్, డివిజన్ మహిళ అధ్యక్షురాలు పుష్ప, డివిజన్ నాయకులు రంజాన్, మైబు, నాగేశ్వరరావు, మహేష్, బాబు, పాషా, తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో అవగాహన

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్‌లో గల శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కార్పేడియం 2కె24 వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎం.శ్రీధర్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో సాంకేతిక నైపుణ్యాలతో పాటు సాంస్కృతిక, సామాజిక అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ వేడుకలు దోహదపడతాయన్నారు. అనంతరం డైరెక్టర్ సాయిగీతిక మాట్లాడగా.. ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, వైశాలి, రాజీవ్, కుమార్, జీఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'న్యూఇరా'లో సోషల్ మీడియా..

ఖమ్మంసహకారనగర్: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో న్యూ ఇరా విద్యాసంస్థల ఆధ్వర్యాన సోషల్ మీడియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఐ.వీ.రమణారావు, డైరెక్టర్ డాక్టర్ పి.భూమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా సామాజిక మాధ్యమాలలోనే గడుపుతున్నారని, వారి ఆలోచనలు, భావాలు, ఉద్వేగాలు, బంధాలపై ఇది ప్రభావం చూపుతోందన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు కే.వీ.ప్రదీప్ మాట్లాడుతూ.. సోషల్ మీడియాపై పలు సూచనలు చేశాక యాజమాన్యం సన్మానించింది.

'ప్రియదర్శిని'లో యువ పార్లమెంట్

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థినులచే యూత్ పార్లమెంట్ వాయిస్ ఆఫ్ ఫ్యూచర్ ఇండియా సమావేశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై వారి అభిప్రాయాలను రూపొందించే సామర్థ్యాన్ని పెంపొందించడానికి విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎ.వెంకటరమణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్‌కిడ్జ్' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంసహకారనగర్: ముంబాయికి చెందిన ఆర్గనైజేషన్ ఆఫ్ నేషనల్ ఆర్ట్ కాంపిటీషన్ సంస్థ నిర్వహించిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్ హ్యాండ్ రైటింగ్, డ్రాయింగ్ పోటీల్లో స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రతిభ చూపిన మచ్చ నిరూప, బట్టు యశ్వినిసాయి, మరో 20 మంది విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

లబ్ధిదారులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

కామేపల్లి: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్దిదారులకు అందజేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ముచ్చర్ల గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన, ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేల పేరుతో కాలయాపన చేయకుండా ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి దుగ్గి కృష్ణ, బాదావత్ శ్రీనివాస్, రాయల వెంకన్న, భూక్యా వీరన్న, వీరభద్రం, వీరయ్య, సోమయ్య, పద్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు అప్రజాస్వామికం

ఖమ్మంరూరల్: కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో గిరిజనులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపడం అప్రజాస్వామికమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నండ్ర ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో లగచర్ల ఘటనకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టగా ఆయన మాట్లాడారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, సీలింగ్ భూములలో పంటకు అనువుగాని భూములలో ఫార్మా కంపెనీలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.సుదర్శన్‌రెడ్డి, పి.సంగయ్య, ఎస్.కృష్ణ,, పి.శ్రీనివాసరావు, వి.నాగేశ్వరరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. పార్టీ వందో సంవత్సరంలో అడుగుపెడుతున్న క్రమంలో శనివారం నర్సింహస్వామి గుట్ట సెంటర్‌లో దుర్గానాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్లపై సర్వే జరిపి అర్హుల వద్ద నుంచి దరఖాస్తులు తీసుకోవడమే తప్ప కొత్తగా చేసిందేమిలేదన్నారు. రేషన్‌కార్డులు ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. టూటౌన్ కార్యదర్శి యానాలి సాంబశివారెడ్డి, రమణ, పాల శ్రీను, ఎండీ.రెహమాన్, ముజమ్మిల్, ఉపేంద్రమ్మ, శోభ, లక్ష్మి, శకుంతల పాల్గొన్నారు.

విద్యార్థికి తీవ్ర గాయాలు


నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన ఇద్దరు ఫస్ట్ ఇయర్ విద్యార్థులు ఘర్షణ పడ్డారు. కాలేజీ నుంచి బయటకు రాగానే వారు అండర్ బ్రిడ్జి వద్ద రహదారిపై తనను ఫొటో తీయడంతో పాటు వీడియో తీశారని ఓ విద్యార్థి మరో విద్యార్థిని ప్రశ్నించడంతో ఘర్షణ చోసుకుంది. ఈక్రమంలో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలు కాగా విషయం తెసులుకున్న అధ్యాపకులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. కాగా, గాయాలైన విద్యార్థి తల్లిదండ్రులు అధ్యాపకులతో వాదనకు దిగాగా.. గాయపరిచిన విద్యార్థి తన తల్లిదండ్రులను కాలేజీకి తీసుకు రావాలని ఆదేశించామని కాలేజీ ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు తెలిపారు. లేని పక్షంలో టీసీ ఇస్తామని చెప్పారు.

నియామకం


దాసరి వెంకటనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంరూరల్: మాల మహానాడు ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా దాసరి వెంకటనారాయణ నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపి మాలల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈమేరకు పలువురు ఆయన్ను పలువురు అభినందించారు.

రాష్ట్ర కార్యదర్శిగా సంపత్


సంపత్‌కుమార్

ఖమ్మంఅర్బన్: తెలంగాణ ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఖమ్మంకు చెందిన కృషి స్టూడియో అధినేత చావా సంపత్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుస్సేన్ నియామక పత్రం అందజేశారు. ఈమేరకు సంపత్‌ను పలువురు అభినందించగా ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు


పనులను పరిశీలిస్తున్న డీవైఎస్‌ఓ

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌కు చేపడుతున్న మరమ్మతులను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న ట్రాక్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నామని, అందుకు టిప్పర్లతో మట్టిని తీసుకొచ్చి మరమ్మతులను చేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ నాయకుల సంబరాలు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల శనివారం బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచాలు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని నాయకులు పేర్కొన్నారు. – సాక్షినెట్‌వర్క్


కూసుమంచి: సంబరాల్లో పాల్గొన్న నాయకులు

కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు

కేరళలోని వయనాడ్ పార్లమెంట్ ఉప ఎన్నికల్లో ప్రియాంకగాంధీ ఘనవిజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచాలు పేల్చి స్వీట్లు పంచారు. రాజ్యాంగ పరిరక్షణకు గాంధీ కుటుంబంతోనే సాధ్యమని కేరళ ప్రజలు విశ్వసిస్తున్నారని నాయకులు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంవన్‌టౌన్: డీసీసీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకుంటున్న నాయకులు